ఆ మాటకి బుచ్చిబాబుకి ఉక్రోషం వచ్చింది.

"నా కెందుకు ధైర్యం లేదూ? మాంసం తింటున్నామని మెడలో ఎముకలు వేస్కుని తిరిగలేం కదా? వాళ్ళంతట వాళ్ళే తెలుసుకుంటారని ఊర్కున్నాను"

"అది నిజమే...కానీ వాళ్ళు నన్ను నీ భార్య అనుకుని మాట్లాడుతున్నా నువ్వు కాదని ఖండించడం లేదు"

"సర్లే... ఇప్పుడా టాపిక్ ఎందుకు?" సంభాషణని తుంచేస్తూ అన్నాడు.

ఎదుటివారితో వాదనతో గెలవలేమని అనిపించినప్పుడు అందరూ చేసే పనే అది. అదే నోరున్నవాళ్ళయితే పెద్ద నోరెట్టుకుని అరుస్తారు. సీత నవ్వుకుంది.

"పాపం! మీ నవీన్ చాలా మంచివాడనుకుంటా" అంది మళ్ళీ బుచ్చిబాబు చాతీమీద చెయ్యేస్తూ.

"ఏం?" అడిగాడు బుచ్చిబాబు. ఆ గొంతులో అప్పుడే కాస్త జెలసీ

"మంచివాడనిపించింది, డీసెంట్ పర్సన్"

"అదే.... ఎందుకని అడుగుతున్నా!" ఈ సారి కాస్తంత చిరాకు.

"నేను మీ స్నేహితురాల్ననీ మనం కలసి జీవిస్తున్నామనీ చెప్పగానే ఆశ్చర్యపోయి వెంటనే తేరుకుని మామూలుగానే మాట్లాడి వెళ్ళిపోయాడు. అతని కళ్ళలోగానీ, మాటల్లోగానీ నేనంటే ఏ విధమైన తేలికభావం నాకు కనిపించలేదు. అదే మీ మోహన్ వున్నాడే... నన్ను మీ భార్య అనుకుంటున్నా అతని చూపులు అదో మాదిరిగా వుంటామ్! నవీన్ మాత్రం వెరీ డీసెంట్ ఫెలో!"

"అవును... నేను ప్రక్కనే వున్నాగా... డీసెంట్‌గానే వుంటాడు!" ఉక్రోషంగా అన్నాడు బుచ్చిబాబు .

సీతకి నవ్వొచ్చింది.

ఎంత జెలసీనో?

"అయితే అతని గొప్పతనం గుర్తించారా?"

"అతనిలో నీకు కనిపించినంత గొప్పతనం నాకేం కనిపించలేదు"

అందరూ ఆడదాని అసూయ గురించి మాట్లాడతారుగానీ మగవాడి అసూయ గురించి మాట్లాడరు.

"ఏమో మరి.. నాకు మాత్రం మీ నవీన్‌ను చూస్తుంటే..."

బుచ్చిబాబు చటుక్కున ఆమె పెదాలను మూసేసాడు. చేత్తో కాదు.... తన పెదాలతో.

అతని చేతులు ఆమెని బలంగా చుట్టేశాయి. ఆమె కూడా అతనికి గట్టిగా అతుక్కుపోయింది.

ఇదివరకటిలా ఆమె ఆలోచించడంలేదు.

అవును మరి ... తప్పు చేసేదాకానే బాధ....భయం! ఒకసారి తప్పు జరిగితే కలిగినంత

బాధా రెండోసారి జరిగిత కలగదు. డైల్యూట్ అయిపోతుంది. మూడోసారికీ, నాలుగోసారికీ, అయిదోసారికీ ఇలా రాను రాను డైల్యూట్ అయిపోయి కొంతకాలానికి ఏ బాధా వుండదు. అది నిజం!

అలా కాకుండా తప్పు చేసిన ప్రతీసారి మొదటిసారి కలిగినంత భయం, బాధా వుంటే సమాజంలో ఇంతమంది వేశ్యలూ, ఇంతమంది నేరస్థులూ, ఇంతమంది లంచగొండి ఉద్యోగులూ వగైరా వగైరా వుండనే వుండరు.

0 0 0

హాల్లో మినిస్టర్ మిన్నారావ్ కాలు కలిన పిల్లిలా ... పోనీ పిల్లి కాకపోతే మనిషిలా అనే అందాం. మినిష్టర్ మిన్నారావ్ కాలు కాలిన మనిషిలా తిరుగుతున్నాడు.

అక్కడే సోఫాలో కూర్చుని అతని భార్య వెంకటలక్ష్మి అతని చేష్టలన్నీ గమనిస్తోంది.

మినిస్టర్ మిన్నారావు ఠక్కున నిలబడిపోయి తల పైకెత్తి సీలింగ్ వంక చూశాడు.

"హా! సింహాద్రి అప్పన్నా! నీకేటన్యాయం సేసాను తంఢ్రీ!" అన్నాడు బాధగా.

తర్వాత భారంగా నిట్టూర్చి మళ్ళీ అసహనంగా అటూ ఇటూ పచార్లు చేయడం మొదలు పెట్టాడు. రెండు నిమిషాలు అలా పచార్లు చేసాక మళ్ళీ హఠాత్తుగా హాలు మధ్య ఆగిపోయి సీలింగ్ వంక చూశాడు.

"హా! నేనేం పాపం చేసాను ఏడుకొండలవాడా?" అన్నాడు కుమిలిపోతూ.

మరో రెండు నిముషాలు అలా కుమిలిపోయి మళ్ళీ హాల్లో పచార్లు మొదలుపెట్టాడు.

కాలు కాలిన కుక్కలా.... కాలు కాలిన పిల్లి, కాలు కాలిన కుక్కలు నడవడం ఎవరు చూశారు?

ఏమో!

ఒక నిముషం తరువాత ఠకాలున  ఆగిపోయి సీలింగ్ వంక చూశాడు.

"హే శ్రీ శైల వాసా....నా నేరం ఏమిటి?"

మినిస్టర్ మిన్నారావ్ కంగారు పడిపోయి గొంతు తడుము కున్నాడు.

అసలు ఈ వాక్యం తను అనాలని అనుకున్నాడు, కానీ తను అనకముందే ఆ వాక్యం వినిపించింది. ఎలా? ఎలా?

"కంగారుపడమాకు. ఇహ ఎట్టాగూ ఆ మాట నువ్వంటావని నేనే అనేశా..." అంది వెంకట్లక్ష్మి.

మిన్నారావ్ ఆమె వంక వెర్రి మొహం వేస్కుని చూసాడు.

"నేనా మాట అంటానని నీకెవరు సెప్పారు?"

"ఓరు సెప్పాలా? ఇందాకట్నుండీ అటూ ఇటూ తిరగడం, పైకి సూడ్డం, ఈ మాటలు

అనడం ఇదేగా సేత్తున్నారు?" చికాకుగా మొహం పెట్టింది వెంకటలాక్ష్మి.

"అవునా?" అయోమయంగా అన్నాడు.

"అయినా రోజూ ఉప్పుసేపల కూర తింటే ఇట్లాగే వుంటుంది... ఎంతిట్టమయితే మాత్రం రోజూ తినాలా?"

"సీ నీయబ్బ! అది కాదులే... నీకు తెల్దు" విసుక్కున్నాడు మిన్నారావ్.

"మరెందుకట్టా గిజుకుపోతున్నావ్?"

"అబ్బా .... ఆ ఇసయం వదిలెయ్" విసుగ్గా అని మళ్ళీ పచార్లు మొదలుబెట్టాడు.

మిన్నారావ్‌కి పరిస్థితి మొత్తం చాలా గందరగోళంగా వుంది. అతనికి జీవితం రోజురోజుకీ దుర్భరంగా మారిపోతుంది. రోజూ ఎవరో ఒకడు ట్రాన్స్‌ఫర్ గురించో, ప్రమోషన్ గురించో వస్తున్నాడు.

ఠట్... కుదుర్దు. వీల్లేదని అంటే పాత న్యూస్ పేపర్ తీసి చూపిస్తున్నారు.
అసలు ఇది ఇంతమందికి ఎలా ప్రచారం జరిగింది? ఇంతమందికి తెలిసిన విషయం పోలీసులకు తెలియలేదంటే ఆశ్చర్యమే. వీళ్ళకి తెలిస్తే, నేరం రుజువయితే కటకటాల వెనక్కి వెళ్ళాల్సిందే!

అసలు ఈ బాధలన్నింటికీ కారణం ఆ బుచ్చిబాబుగాడే!

ట్రింగ్ ట్రింగ్...... ట్రింగ్....ట్రింగ్.......

ఫోన్ మోతతో ఈ లోకంలోకి వచ్చాడు మినిస్టర్ మిన్నారావ్.

రిసీవర్ ఎత్తి "హలో...." అన్నాడు.

"హలో ... మినిస్టర్ మిన్నారావ్‌గారున్నారా?" అడిగింది అవతలి కంఠం.

"నేనే మాట్లాడుతున్న.... ఎవరు?" అడిగాడు మిన్నారావ్.

"మేము ఉప్పుచేపలూ, ఎండు రొయ్యల షాపు పెడ్తున్నామండి. దాన్ని మీతో ఓపెనింగ్ చేయించాలని అనుకుంటున్నాం. మీ కిష్టమైతే ఇంటికొచ్చి వివరంగా మాట్లాడ్తాం" చెప్పింది అవతలి గొంతు.

"ఓపెనింగ్స్‌కి మనమెప్పుడూ రెడీనే! కానీ సిన్న కండిషన్"

"ఏంటండీ అదీ?"

"ఓపెనింగ్ సేసినందుకు గుర్తుగా నాకు బంగారు రొయ్య పెజెంటేషన్ ఇయ్యాల!"

"ఓ.....తప్పకుండా"

"మరో ఇసయం.... ఆ ఓపెనింగ్స్ కారెక్రమం జరిగేసోట జనాన్ని బాగాసోదా సెయ్యాలా!"

"ఓ తప్పకుండా సార్! బాంబులు, మారణాయుధాలు తెస్తారేమోననేగా మీ భయం?"

"కాదు... పాత న్యూస్ పేపర్లు తెస్తారని భయం! సభకి వచ్చి నోళ్ళ దగ్గర పాత న్యూస్‌పేపర్లు ఉండకూడదు. ఎవరి దగ్గ రైనా పాత న్యూస్‌పేపరుంటే ఆడిని ఆ శాయలకి కూడా

రానివ్వకండి"

"అదేంటి సార్?" అవతలి వ్యక్తి గొంతులో అశ్చర్యం.

"అదంతే... నా ఇసయంలో పాత న్యూస్‌పేపర్లు బాంబులకంటే ప్రమాదం! మిగతా ఇసయాలు పర్సనల్‌గా మాట్లాడుకుందాం. ఇక్కడి కొచ్చెయ్యండి" అని ఫోన్ పెట్టేసాడు మిన్నరావ్.

ఇంతలో ప్యూన్ వచ్చాడు.

"అయ్యగారూ.... తమరికోసం ఎవరో వచ్చారండీ" అన్నాడు.

"ఆడి దగ్గర పాత న్యూస్‌పేపర్ ఏదైనా వుంటే నేను లేనని సెప్పి పంపించెయ్. న్యూస్‌పేపర్ లాంటిది ఏదీ లేకపోతే లోపలికి పంపించు!" అన్నాడు మిన్నారావ్.

ప్యూన్ మిన్నారావ్ వంక అయోమయంగా చూసాడు.

"ఏటలా సూత్తావ్...బాగా సెకింగ్ సెయ్యి...నీవల్ల కాకపోతే మన గార్డ్‌సేత సేయింసు. పాత న్యూస్ పేపర్ ఏదైనా కనిపిస్తే లోపలికి రానియ్యకండి"

"అలాగేనండయ్యా!" బుర్ర గోక్కుంటూ వెళ్ళిపోయాడు ప్యూన్.

"అసలు ఇందాకట్నుండీ పాత న్యూస్‌పేపర్లంటున్నారు. ఆ గొడవేంటండీ?" అడిగింది వెంకట్లక్ష్మి.

"అయన్నీ రాజకీయాలు! రాజకీయల్లో బుర్రెట్టకని లచ్చసార్లు సెప్పాను! సెప్పానా లేదా?" జుట్టు పీక్కుంటూ పెళ్ళాం మీద అరిచాడు మినిస్టర్ మిన్నారావ్.

0 0 0

బుచ్చిబాబు ఆవులించుకుంటూ నిద్రలేచి గోడ గడియారం వంక చూశాడు.

టైం ఎనిమిది అయింది.

"బాబోయ్?" గట్టిగా అరిచి మంచం మీంచి కిందికి దూకాడు.

ఎనిమిది గంటలకు నిద్ర లేస్తే ఎప్పుడు మొహం కడుక్కోవాలి? ఎప్పుడు కాఫీ త్రాగాలి? ఎప్పుడు వంట చెయ్యాలి? ఎప్పుడు స్నానం చెయ్యాలి? ఎప్పుడు భోజనం చెయ్యాలి? ఎప్పుడు తయరై ఆఫీసుకెళ్ళాలి?

ఆంత బండగా నిద్రపోయినందుకు బుచ్చిబాబు తనని తాను పచ్చి బూతులు తిట్టుకున్నాడు. నేను నిద్రపోతే పోయాను. సీతయినా నిద్ర లేపోచ్చుగా? ఛా ఛా మోస్ట్ ఇర్రెస్పాన్స్‌బుల్ పర్సన్! అని తిట్టుకుంటూ గూట్లోని పేస్టు బ్రష్షు అందుకున్నాడు.

ఎక్కడా అలికిడి లేదు. సీత ఎక్కడుంది?

పళ్ళు తోముకుంటూ హాల్లోకి వెళ్ళాడు. సీత అక్కడలేదు.

అక్కడి నుండి వంట గదిలోకి వెళ్ళాడు.

సీత అక్కడుంది బిజీగా వంట చేసేస్తూ. ఆ సీన్ చూసి బుచ్చిబాబుకి సంతోషంతో గట్టిగా కేకెయ్యలనిపించింది. కాని నోటినిండా పేస్టు నురగ ఉండడంతో ఆ ప్రయత్నం మానుకున్నాడు.

గబగబా పళ్ళు తోముకుని వంట గదిలోకి వెళ్ళాడు.

"థాంక్యూ సీతా...ఇంత అలస్యంగా లేచాను ఇప్పుడు వంటెలా చెయ్యాలి, ఆఫీసుకెప్పుడెళ్ళాలి అని కంగారు పడుతున్నా" అన్నాడు సీత బుగ్గమీద ముద్దు పెట్టుకుంటూ.

"కూర్చో కాఫీ ఇస్తా!" అంది సీత.

బుచ్చిబాబు సీటు వేసుకుని కూర్చున్నాడు. సీత కాఫీ కాచి కప్పులో పోసి అతని కందించింది.

"నీకో?" అన్నాడు బుచ్చిబాబు.

"నేను ఇందాక తాగేసాను. నేనేం నీ పెళ్ళాన్ని కాదుగా. నువ్వు వచ్చేదాకా ఆగడానికి?" నవ్వుతూ అంది సీత .

"పెళ్లాం కాకపోతేనేం... నా మీద చచ్చేంత ప్రేమ ఏర్పడిందిగా... అందుకే పాపం నాకెక్కడ ఆలస్యం అయిపోతుదో.. నేనెక్కడ ఇబ్బంది పడిపోతానో అని నేను లేచేదాకా ఆగకుండా గబగబా వంట చేసేస్తున్నావ్? ఎలాగయినా ఈ మధ్య నీకు నేనంటే ప్రేమ ఎక్కువైపోయిందిలే" చిలిపిగా అన్నాడు బుచ్చిబాబు .

"అదేం కాదులే.... ఈ రోజు నుండీ వంట డ్యూటీ నాది!" నిర్లిప్తంగా అంది సీత.

"ఆ!" నోరు తెరిచాడు బుచ్చిబాబు.

"సరే.... సరే తెరిచింది చాలు! ఆ నోరు కాస్త మూసి త్వరగా కాఫీ త్రాగు.. చల్లారిపోతుంది".

బుచ్చిబాబు కాఫీ త్రాగి కప్పు నేలమీద పెట్టాడో లేదో డోర్‌బెల్ మోగింది.

ఇహ లైఫ్ మొత్తం సాఫీగా, హాయిగా ప్రేమమయంగా సాగిపోవడమే!

విజిలేస్కుంటూ వీధి తలుపు గడియ తీసిన బుచ్చిబాబు ఎదురుగా వున్న వాళ్ళని చూసి కెవ్వుమని అరిచాడు.

ఎదురుగా సూట్‌కేసులతో అతని తల్లి దండ్రులు పార్వతమ్మ, పర్వతాలరావులు నిలబడి వున్నారు. పర్వతాలరావు, పార్వతమ్మ బిత్తరపోయి బుచ్చిబాబు వంక చూశారు.

రెండు క్షణాల తరువాత పర్వతాలరావు తేరుకుని బుచ్చిబాబుని ప్రశ్నించాడు "అదేంట్రా వెధవాయ్ మమ్మల్ని చూడగానే అంత ఘోరంగా అరిచావ్. మమ్మల్ని చూస్తే ఏ దయ్యాన్నో భూతాన్నో చూసినట్లుగా వుందా నీకు?"

"వాటిని చూసినా ఇలా అరిచుండేవాడిని కాదు. ఈ టైం అలాంటిది" నసిగాడు బుచ్చిబాబు.

"ఏంటో వెధవ..... ఏదీ స్పష్టంగా మాట్లాడు. సరే... గుమ్మానికి అడ్డంగా గెడకర్రలా నిల్చుండి పోయావ్. మమల్ని లోపలికి రానియ్యవా ఏంటి?" బుచ్చిబాబుని తోస్కుని లోపలికి రాబోయాడు పర్వతాలరావు.

"కెవ్వ్వ్....."

మరోసారి భయంకరంగా అరిచి వాళ్ళ మొహం మీద తలుపేసేసి గడియపెట్టి వంటగదిలోకి పరుగు తీసాడు బుచ్చిబాబు.

“ఏంటలా అరుస్తున్నావు. ఎవరొచ్చారు?” అడిగింది సీత.

“కొంపలు మునిగిపోయాయ్” ఆయాసపడుతూ అన్నాడు బుచ్చిబాబు.

“నాన్చకుండా విషయం సరిగ్గా చెప్పు” విసుక్కుంటూ అంది సీత.

“మా అమ్మా నాన్నా వచ్చారు” పాలిపోయిన మొహంతో చెప్పాడు బుచ్చిబాబు.

“హమ్మయ్య ఈ ఛాప్టర్‌కి ఇక్కడితో తెర పడుతుందన్న మాట. రానీయండి, రానీయండి. కొడుకు లీలలు కళ్ళారా చూసి ఆనందిస్తారు”.

“అవునుగానీ వాళ్లేరి.. లోపలికి రాలేదా?”

“లేదు... వాళ్ళని బయటే ఉంచి గడియపెట్టేసా!”

“ఎందుకూ?” ఆశ్చర్యంగా చూసింది సీత .

“ఎందుకేంటి? నిన్నిక్కడ చూస్తే మా నాన్న అగ్గిరాముడై పోతాడు ” కంగారుపడుతూ అన్నాడు.

“అయితే నన్నిప్పుడు ఏం చేయమంటావ్?”

“నువ్వు ఇక్కడి నుండి వెంటనే వెళ్ళిపోవాలి?”

సీత చేతిలోని గరిట జారి నేలమీద ఠంగున శబ్దం చేస్తూ పడింది.

“నేను వెళ్ళిపోవాలా? ఎక్కడికి?” అయోమయంగా చూసింది.

“ఒరేయ్ వెధవాయ్.. తలుపులు తియ్యరా సన్నాసెదవా” బయట నుండి తలుపులు దబదబ బాదేస్తున్నాడు పర్వతాలరావు.

“బాబోయ్ మా నాన్న తలుపులు విరగొట్టుకుని లోపలికి వచ్చే సేలా వున్నాడు” గాభరాగా అన్నాడు బుచ్చిబాబు .

“ఉండు. నేను వెళ్ళి తలుపులు తీస్తాను” సీత వెళ్ళబోయింది.

“అమ్మో..వద్దు సీతా” అన్నాడు.

“ఈ విప్లవ మార్గంలో వెళ్ళడానికి నీకు ధైర్యం లేనప్పుడు బుద్ధిగా పెళ్ళిచేసుకో ఉండు మీ అమ్మా నాన్నలతో జరిగిందంతా చెప్పేస్తాను”.

“సీతా సీతా సీతా ... ప్లీజ్ కాస్త ఓపికపట్టు హఠాత్తుగా నువ్వీ విషయం చెపితే మా నాన్న గుండాగిపోతుంది”.